క్లుప్తంగా

రేణుమాకులపల్లెలో వైఎస్సార్ క్రికెట్ టోర్నీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని రేణుమాకులపల్లెలో శనివారం వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించినట్లు నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, రమేష్ తెలిపారు. విన్నర్స్‌కు రూ.35వేలు, రన్నర్స్‌కు రూ.15వేలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు విజయభాస్కరరెడ్డి, జంపాల రాజేష్, గోపీనాథరెడ్డి, మహేష్ ప్రసాద్‌రెడ్డి, వెంకటేష్, శేషాద్రి, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

మొలకల పౌర్ణమి పూజలు


ఊరేగుతున్న గంగమ్మ

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె బొమ్మసముద్రం గంగమ్మ ఆలయంలో అమ్మవారికి మొలకల పౌర్ణమి పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాత్రి ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా నృసింహుని కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సదుం: మండలంలోని నాయినవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం వేడుకగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి ఏర్పాటు చేసిన వీధి నాటకం అలరించింది.

తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి


జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ అఖిల

పెద్దపంజాణి: మండలకేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ అఖిల శనివారం చిత్తూరులో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీలో మంచినీటి సరఫరా బోరు వేయించేందుకు నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. దీనిపై జెడ్పీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్


పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రామకుప్పం: మండలంలోని మణీంద్రం పంచాయతీ వంకచేను గ్రామానికి చెందిన విజయన్ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ భరత్ దృష్టికి ఈ విషయాన్ని సర్పంచ్ ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్సీ వెంటనే స్పందించారు. బాధితుడికి పింఛన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం విజయన్‌కు రూ.10 పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత చంద్రమోహన్‌రెడ్డి, వైస్ సర్పంచ్ గోపి, వెల్ఫేర్ సెక్రటరి రాంబాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

గంగవరం : స్థానిక పీహెచ్‌సీని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రాజశేఖర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


విద్యార్థులతో ఉపాధ్యాయులు

వి.కోట: ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కన్నన్ తెలిపారు. శనివారం పట్టణంలోని సర్కారు బడుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు మండలంలోని గాండ్లపల్లె కొత్తూరు, హనుమంతనగర్, పాపేపల్లె, బసాపురం, చౌడేపల్లె, భారత్‌నగర్, ఇటుకరాళ్లపల్లె, వి.కోటలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిలలను చేర్పించాలని కోరారు.


చెత్తపెంట వద్ద వేరుశనగ విత్తనాలందడంతో పొలం దున్నే పనుల్లో రైతు


కొలమాసనపల్లెలో ఎరువులు తీసుకుంటున్న రైతులు


మొరం ఆర్‌బీకేలో కియోస్క్ సేవలు పొందుతున్న రైతులు

అన్నదాత సేవకు 'భరోసా'

అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. సాగును సంబరంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తోంది. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించింది. సజావుగా సేద్యం చేసుకునేందుకు పకడ్బందీగా సేవలందిస్తోంది. అందులో భాగంగా ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందజేస్తోంది. సకాలంలో ఎరువులు.. పురుగుమందులను పంపిణీ చేస్తోంది. భూసార పరీక్షలు చేయించి అధిక దిగుబడి సాధించేలా దిశానిర్దేశం చేస్తోంది. పండించిన పంటలను గిట్టుబాటు ధరకే కొనుగోలు చేయిస్తోంది. వ్యవసాయాన్ని పండుగలా మార్చడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తోంది.


పలమనేరు మండలం పెంగరగుంటలోని రైతుభరోసా కేంద్రం

- అందుబాటులో ఆర్‌బీకేలు
- సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ
- కియోస్క్ ద్వారా డిజిటల్ సాయం
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు
- సాగుకు అవసరమైన సలహాలు

పలమనేరు : రైతు సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారు. అన్నదాతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా 2020 మే 30వ తేదీన గ్రామ సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. రైతు తన స్వగ్రామంలోనే ఆర్‌బీకేల ద్వారా సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలను రవాణా సమస్యల లేకుండా ఎమ్మార్పీ ధరకే కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అలాగే భూసార పరీక్షలు చేయించి, ఏ పంట సాగు చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. ఆర్‌బీకే సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి తగు సలహాలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

క్షేత్రస్థాయిలో సేవలు ఇలా..

ఆర్‌బీకేల్లో డిజిటల్ ఆధారిత సేవలు అందుబాటులో ఉన్నాయి. మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌ల ద్వారా రైతులకు సాంకేతిక సాయం అందిస్తున్నారు. ఇప్పటికే మండలంలో 95శాతం ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేశారు. దీని ఆధారంగానే ఆర్‌బీకేల్లో సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్నారు. సీఎం యాప్ ద్వారా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. భూసారపరీక్షల శ్యాంపుల్స్ సేకరణ ఒక్కో అర్‌బీకే పరిధిలో 30 చొప్పున తీయించి ల్యాబ్‌కు పంపారు. వీటి ఆధారంగా రైతులకు పంటల సాగుపై సూచనలు చేయనున్నారు. దీంతో పెట్టుబడి తగ్గి అధిక పంట ఉత్పత్తి లాభదాయకంగా మారింది. మండలంలోని 12 కస్టమ్ హైరింగ్ గ్రూపులున్నాయి. ఇందులో వైఎస్సార్ యంత్రసేవల ద్వారా 9 ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందించారు. ఇప్పటికే కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు కార్డులను మంజూరు చేశారు. బ్యాంకు సహాయకులను ఆర్‌బీకేలకు అనుసంధానం చేయడంతో ఆయా గ్రామాల్లోనే సున్నావడ్డీతో రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించారు. రైతుభరోసా ద్వారా ముందుగానే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు. పంటలకు ఉచిత బీమా నమోదు చేస్తున్నారు. పొలం బడి ద్వారా క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. ముఖ్యంగా పంట కోత ప్రయోగాలు, పంటల సాగుపై అవగాహన కల్పించేలా రైతుభరోసా మాసపత్రికను అందుబాటులోకి తీసుకువచ్చారు. పంట దిగుబడులను పెంచేలా వినూత్న సాగు విధానాలను ఆర్‌బీకే చానెల్ ద్వారా ప్రసారం చేయిస్తున్నారు. ప్రత్యేకంగా రైతుల కోసం వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసి సలహాలు అందిస్తున్నారు. అయితే గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. ఎరువులు, పురుగు మందులు కావాలంటే దూరాభారం వెళ్లాల్సి వచ్చేది. ఫెర్టిలైజర్ దుకాణాల వారు చెప్పిన రేటుకే కొనుగోలు చేసుకునేవారు. అవి రవాణా చార్జీలతో కలిసి తడిసి మోపెడు అయ్యేది. అలాగే నకిలీ విత్తనాలు, పురుగుమందులతో తీవ్రంగా నష్టపోయేవారు. ఇప్పుడు అలాంటి దుస్థితి తప్పిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు అనుకూల ప్రభుత్వంలో తమ కష్టాలు గట్టెక్కాయని సంబరపడుతున్నారు. ఆర్‌బీకేలు ఉపయోగకరంగా ఉన్నాయని వెల్లడిస్తున్నారు.

పలమనేరు మండలంలో ఆర్‌బీకే సేవలు

మొత్తం రైతు భరోసా కేంద్రాలు :	12
సిబ్బంది :	12
మల్టీఫంక్షనల్ కియోస్క్‌లు :	12
సేవలు పొందుతున్న రైతులు :	6,039 మంది
పంపిణీ చేసిన ఎరువులు :	400 టన్నులు
పురుగుమందులు :	200 లీటర్లు
విత్తనాలు :	80 క్వింటాళ్లు
వేరుశనగ విత్తనకాయలు :	1,056 క్వింటాళ్లు
కస్టమ్ హైరింగ్ గ్రూపులు :	12
వైఎస్సార్ యంత్రసేవ కింద అందించిన ట్రాక్టర్లు :	9
పంపిణీ చేసిన కౌలు కార్డులు :	15
ఇప్పటి వరకు రైతుభరోసా పథకం కింద అందించిన మొత్తం :	రూ.164.82 కోట్లు

ఒకే చోట వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది

రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధకశాఖ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో అన్ని రకాల సేవలు రైతులకు ఒకే చోట అందుతున్నాయి. పలమనేరు మండలంలో వేరుశనగ, వరి, కూరగాయల సాగు అధికంగా ఉంది. 60శాతం మందికి పాడి పరిశ్రమే ఆధారం. 30శాతం మంది పట్టు పరిశ్రమపై ఆధార పడి ఉండేవారు. గతంలో ఎలాంటి సహాయం కావల్సి వచ్చినా, సలహాలు అవసరమైనా రైతులు నానా అవస్థలు పడేవారు. ఇప్పుడు అన్నిశాఖల సిబ్బంది రైతు భరోసా కేంద్రాల్లో ఉండడంతో సకాలంలో సేవలు అందుతున్నాయి.

ఎరువులకోసం టౌన్‌కు వెళతావుంటిమి



ఇంతకుముందు ఎరువులు కావాలంటే పలమనేరు టౌన్‌కు వెళతావుంటిమి. అక్కడ ఎక్కువ రేటుకు కొంటావుంటిమి. బస్తాలను ఇంటికి తీసుకెళ్లాలంటే రవాణా చార్జీ అదనంగా పడేది. ఇప్పుడలా కాదు ఇంటి ముందరే ఆర్‌బీకేలో ఎమ్మార్పీకే కావాల్సిన ఎరువులు దొరుకుతున్నాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎరువులు కొనుక్కోవచ్చు. ఏ సౌకర్యం కావాలన్నా ఇక్కడ అందుబాటులో ఉంటుంది. – గోవిందురెడ్డి, రైతు, బేరుపల్లె, పలమనేరు మండలం

చాలా సౌకర్యంగా ఉంది



ఇంతకు ముందు పంటకు తెగులు సోకితే ఆ మొక్కను తీసుకుని పట్టణంలోని ఎరువుల షాపు వాళ్లకు చూపించేవాళ్లం. వారు ఇచ్చిన మందులను పంటకు వాడేవాళ్లం. అవి పనిచేయకుంటే పంట పోయేది. ఇప్పుడు అలా కాదు. ఏ పంట అయినా మా గ్రామంలోని ఆర్‌బీకే సిబ్బంది వచ్చి చూసి అవసరమైన మందులను అందిస్తున్నారు. దీంతో చాలా సౌకర్యంగా ఉంది. – వెంకటరెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

అన్ని విధాలుగా ఆదుకుంటున్నారు



రైతుకు పంట పెట్టుబడిగా రైతుభరోసా, పొలం దున్నుకునేందుకు ట్రాక్టర్, ఆర్‌బీకేల్లో ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందిస్తున్నారు. పంట దిగుబడి వచ్చాక గిట్టుబాటు ధరలకే కొనుగోలు చేస్తున్నారు. నష్టపోతే పంట బీమా కింద పరిహారం ఇప్పిస్తున్నారు. ఈ స్థాయిలో ఎక్కడా సేవలందడంలేదు. రైతును అన్నివిధాలుగా ఆదుకుంటున్నారు. – గేట్ బాబు, రైతు, పలమనేరు

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం : పేదల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శనివారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న పాలనలో లక్షలాది మందికి ఉద్యోగావకాశం కల్పించారన్నారు. ఈ క్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆరేళ్ల జయప్ప, సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యులు సౌమ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు రామకృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, నరేంద్రరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీవర్ధన్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

కుప్పంరూరల్ : మండలంలోని చీలపల్లెలో ప్రభుత్వం సబ్సిడీపై అందించిన విత్తనాలను ఎమ్మెల్సీ భరత్ చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు. భరత్ మాట్లాడుతూ తొలకరి మొదలవగానే సకాలంలో విత్తనాలు అందిస్తున్నామన్నారు. బస్తా వేరుశనగ విత్తనాలను రూ.1,674కే అందజేస్తున్నట్లు వెల్లడించారు. రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, స్థానిక నేత చలపతి పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం : పంచాయతీ పరిధిలోని కెంపసముద్రం, తిమ్మసముద్రం, చెన్నారెడ్లపల్లె, రామకుప్పం రైతులకు 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ శనివారం పంపిణీ చేశారు. విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అధికారి మధురవాణి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన


పుంగనూరు: విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

పుంగనూరు : పట్టణంలోని కొత్తయిండ్లు హైస్కూల్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి అభ్యసన సామర్థ్యాలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పరిశీలించారు. శనివారం ఆయన పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. అలాగే విద్యాకానుక కిట్‌లను పరిశీలించారు. భగత్‌సింగ్‌కాలనీ, రాంనగర్, ప్రకాశంకాలనీల్లోని విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రవీణ్‌ప్రకాష్ మాట్లాడుతూ నాడు–నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల ప్రారంభం రోజునే పిల్లలకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేయాలన్నారు.

చౌడేపల్లె : స్థానిక జూనియర్ కాలేజీ స్టాక్ పాయింట్‌కు చేరిన జగనన్న విద్యాకానుక కిట్‌లను ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు. విద్యాసామగ్రిలో ఏమైనా డ్యామేజీ వస్తువులుంటే వెంటనే రిటర్న్ చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈఓ విజయేంద్రరావు, ఆర్జేడీలు రవి, వెంకటకృష్ణారెడ్డి, సర్వశిక్ష అభియాన్ పీడీ మధుసూదన్‌రెడ్డి, ఎంఈఓ కేశవరెడ్డి ఉన్నారు.

ప్రాజెక్టులను అడ్డుకునేందుకు సిగ్గులేదా?


మాట్లాడుతున్న శంకరప్ప, కృష్ణప్ప

పుంగనూరు: పద్నాలుగు సంవత్సరాల తెలుగుదేశం పాలనలో ఒక్క అభివృద్ధి కూడా చేపట్టని చంద్రబాబునాయుడు, ఆపార్టీ జెండా కోసం ఆరాటపడుతున్న రామచంద్రయాదవ్ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి సిగ్గులేదా అంటు దళిత నాయకులు నిలదీశారు. శనివారం దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరప్ప విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో 30 ఏళ్లుగా జరగని అభివృద్ధి నాలుగేళ్లలో జరిగిందన్నారు. ఇది చూసి సహించలేక పుట్టగతులుండవన్న ఆవేదనతో తెలుగుదేశం నాయకులు తప్పుడు కేసులు దాఖలు చేశారని విమర్శించారు. ఏపార్టీనో కూడ తెలియని రామచంద్రయాదవ్ మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లోకి వెళ్లి పరిశీలించుకోవాలన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు గంగప్ప, కృష్ణప్ప, లక్ష్మీపతి, అశోక్‌కుమార్, గంగరాజు, రామకృష్ణ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


మురుగేష్ మృతదేహం

రామకుప్పం: మండలంలోని బగళనత్తం గ్రామంలో శనివారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. బల్ల గ్రామానికి చెందిన మురుగేష్(38) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అందులోభాగంగా ఓ ఇంటి పైకప్పు కమ్మీ కట్టేందుకు యత్నిస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్‌తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మురుగేష్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ భరత్ పరామర్శించి తక్షణ సాయంగా రూ.10 వేలు అందించారు.

పొదుపు మహిళల ర్యాలీ


ర్యాలీలో ఏపీఎం శివయ్య తదితరులు

సోమల : మండలంలోని వల్లిగట్ల సమాఖ్య–2 మహిళలతో కలిసి ఏపీఎం శివయ్య శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సభ్యురాలు ప్రభుత్వం అందిస్తున్న ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ నరసింహులు, సంఘమిత్రలు భువనేశ్వరి, మంజుల, వీఓ లీడర్లు కోమల, సులోచన పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

చౌడేపల్లె: ఘర్షణ కేసులో ఇరువర్గాలపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రవికుమార్ శనివారం తెలిపారు. అమినిగుంటకు చెందిన శ్రీనివాసులకు చెందిన మామిడితోటలో అదే గ్రామానికి చెందిన దేవరాజులు, సుబ్రమణ్యం కాయలు కోస్తున్నాడు. ఇది గమనించిన శ్రీనివాసులు వారిని హెచ్చరించాడు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



రొంపిచెర్ల : తమ కుటుంబసభ్యుల నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట శనివారం పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. మండలంలోని లోకవారిపల్లెకు చెందిన బాలాజీ, తిరుపతికి చెందిన దీప మూడేళ్లగా ప్రేమించుకుంటున్నారు. ఇంట్లో చెప్పకుండా నాలుగు రోజుల క్రితం కులాంతరం వివాహం చేసుకున్నారు. అయితే అమ్మాయి కుటుంబ సభ్యులు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని పోలీసులకు తెలిపారు. ఇద్దరూ మేజర్లు కాబట్టి వివాహం చెల్లుబాటు అవుతుందని పోలీసులు స్పష్టం చేశారు. అమ్మాయి తల్లిదండ్రులు తిరుపతి యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ఇంటింటికీ మినరల్ వాటర్

పలమనేరు : పట్టణంలోని 19వార్డులో కౌన్సిలర్ శ్రీలక్ష్మీరాజేష్ నిత్యం ఇంటింటికీ రెండు క్యాన్ల మినరల్ వాటర్‌ను పంపిణీ చేస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు సొంత నిధులు వెచ్చించి నీరు అందిస్తున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. వార్డు వాసులు కౌన్సిలర్‌తోపాటు మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం


సదుంలో అవగాహన ర్యాలీ

రొంపిచెర్ల: సైక్లింగ్ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యాధికారి రాజా తెలిపారు. శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా రొంపిచెర్లలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌తో గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం రావని వెల్లడించారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, సీహెచ్‌ఓ కాంతమ్మ, పీహెచ్ఎన్ పార్వతమ్మ, ఎంపీహెచ్ఎస్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీ గీతాశ్రీ, ఆరోగ్య కార్యకర్తలు గాయత్రి, వేంకటేశ్వరి పాల్గొన్నారు.

సదుం: మండల కేంద్రంలో సైకిల్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యుడు చరణ్ పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రంలో ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహించారు. సైక్లింగ్‌పై అవగాహన కలిస్తూ సైకిల్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జయసింహ, రమ్యశ్రీ,, విజయలక్ష్మి, పర్యవేక్షకులు చిన్నప్ప, రహీమా పాల్గొన్నారు.


కల్లూరు : సైకిల్ ర్యాలీలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పీహెచ్‌సీ పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ షుకూర్, వైద్యాధికారి జానకీరావు, నాయకులు షౌకత్‌అలీ, మునస్వామి, చైతన్య, ఫయాజ్, రూపేష్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి : మండలంలోని కోగిలేరు గ్రామంలో రాయలపేట ఆరోగ్య కేంద్రం సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు, సర్పంచ్ రమేష్‌బాబు, పీఎస్ గణపతి పాల్గొన్నారు.

వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దపంజాణి: మండలంలో చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జూలై ఆఖరుకు 470 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పనులు పూర్తయిన వారి బిల్లులను వెంటనే చెల్లించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, విస్తరణ అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.